

# ఆర్తి

'' ఆర్తో జిజ్ఞాసు అర్థ అర్థీ, జ్ఞానీచ'' అన్నావు పరాత్పరా! ఈ నలుగురు నన్ను గుర్తు చేసుకుని ప్రార్థిస్తారని నీ ముఖం నుండి వెలువడిన గీత చెపుతున్నది. సర్వవ్యాపీ! అదిగూడా! ''పూర్వజన్మ ఫలదివ్యజ్ఞాన సంపత్తి'' అని గజేంద్రుని కథలో వున్నది. '' ఈ మొసలినిలా గెలవలేను. పరాత్పరుడే నన్ను రక్షించాలి'' అని గజేంద్రుడనుకున్నాడు. సభలోకి ద్రౌపదిని దెచ్చి, దుశ్శాసనుడవమానింపగా అక్షయమిచ్చి బ్రోతివీ. ఆమె చీర తొలగనే లేదు. రెండు చేతులెత్తి, నిస్సహాయురాలనని, పతులు వేవురు చేష్టలు దక్కి నిలువగా, విశ్వాసముతో నిన్ను దలుచుకున్నది ద్రౌపది. సర్వశక్తిమంతుడా! అలాగే నేనూ ఆర్తిలో వున్నాను. నీవే ఒడ్డు పట్టించాలి. యెందుకార్తిలో వున్నానంటే, సంపదల చేతా, యౌవనము చేతా, తీయని మాటల చేతా ఆకర్షింపబడ్డాను. నిజంగా అది మోహమే. మోహము గుడ్డిది. నా కళ్లూ చెవులూ నన్ను మోసగించాయి. కనులేదురు చెంది యెర నోట కరుచుకుని తప్పించుకోలేని చేపలాగా విలవిలలాడాను''.

శకుంతల వ్యథ, అవస్థ చూడలేక మేనక చెలి, ''రాజధానిలో రాజప్రాసాదంలో, మహారాణి లాగా వెలిగి పోవాల్సిన అమ్మాయి, ఆశ్రమంలో శరీరకష్టం చేసుకుంటూ, కొడుకును పెంచుతున్నది. ఒక విధంగా ముని వృత్తే. నార చీర, కందమూలాదులు ఆహారం. యెన్నాళ్లిట్లా దీనావస్థలో వుంటుందీ? అని మేనకను అడిగింది. మేనక, ''మొదట దుష్యంతునీ శకుంతలనూ కలిపినది మోహము. మోహము వ్యథ తెచ్చింది అయిపోవచ్చింది. దుష్యంతునీ శకుంతలనూ యీ మారు దైవము కలపబోతున్నాడు. దేవదానవ యుద్ధంలో, దేవతల పక్షాన నిలిచి పోరాడి గెలిపించి వస్తున్నాడు దుష్యంతుడు. మారీచాశ్రమంలో

శకుంతలను కలుసుకుంటాడు. కొడుకుని ముద్దు చేస్తాడు. మరీచ మహాముని ఆశీస్సులతో, ఆయన యెదుట తన పొరపాటు ఒప్పుకుని, శకుంతలనూ, కొడుకునూ తన వెంట తీసుకెళ్తాడు'' అన్నది మేనక.

''డిగ్రీ, ధనసంపాదన, స్టేటస్, ప్రజాసేవ, కీర్తి, ప్రతిష్ఠ, సమర్ధతా, అయాచితంగా ఒళ్లో పడబోతున్నాయనే భ్రమకు లోనై ప్రమాదంలోకి నడిచాను. అటువంటివి అయాచితంగా లభించవు. ఒడిదుడుకులుంటాయని తెలిసింది. దూరం నడవాలని తెలిసి వచ్చింది. వెలికి, యేవగింపుకీ గురైనాను. ధనమూల మిదం జగత్. అదే మోసగించింది. ''మరి ఆశకు లొంగితే యీ పరిస్థితి రాక యే పరిస్థితి వస్తుంది అని ఆశించావు?'' అని విరగబడి నవ్వింది ధనం.

''యెండమావుల వెంట పరుగుతీస్తే దాహం తీరకపోగా ఆర్తి పట్టుకున్నది. పీడిస్తున్నది. తప్పులూ నిందలూ నెత్తికెక్కాయి. నాది దురాశగాదే పరత్పరా? దుఃఖం చేటూ యెందుకంటుకున్నాయీ? డబ్బు లాగాలని చేరిందన్నారు. పోనీ అది నిజమని ఒప్పుకుందామన్నా, అదీ మిధ్యే. డబ్బూ లేదు. డబ్బు గల మనిషీ లేడు. పులికోరల్లో చిక్కుకున్నాను''.

''ఈ హింసలూ అవమానాలకి ఒక పేరుపెట్టి పిలిచే హిరణ్యాకశిపా అనచ్చు. మృగంలాగా తయారైన వానిని హతమార్చటానికి సగం మృగం సగం మనిషిలాగా అవతార మెత్తావుట ప్రహ్లాదుని అవస్థలు విరగడ చేశావుట''.

''ఈశ్వరా! అజ్ఞానం తప్పితే, నాకు దుశ్చింతా లేదు, అత్యాశా లేదు. ధనవంతుని లోబరుచు కోవాలనీ లేదు. ధనం బావుకోవాలనీ లేదు. కేవలం స్వతంత్ర జీవనం కోరాను. సహభాగినీ కావాలను కోలేదు. స్వతంత్ర జీవనం

అని యెందుకు కలగన్నానంటేపరాత్పరా! బాల్యం నించీ, యేవగించీ, దూషించీ, పనిచేయించీ, పిడికెడన్నం పడేసే వారినే చూశాను. చిరిగిన పాత గుడ్డలు ఆనందమిచ్చేవి కావు. తిండి సరేసరి మాడు చెక్కలూ మంచి నీళ్లూ. ప్రేమా దయా సానుభూతీ యెలా వుంటాయో యెరగను''.

''చివరికి వచ్చింది స్థితి. బిడ్డను గనాలి. పెంచాలి. రోజులు యుగాలయాయి. శక్తి వుడిగింది. ధైర్యము సన్నగిల్లింది. ఠావుల్ తప్పెను. మూర్ఛ వచ్చె. తనువున్ డస్సెన్. నీవే తప్ప యితః పరంబెరుగ! రావే యీశ్వర కావవే వరద. చేతులెత్తేసిన వారిని కాపాడవస్తావనీ వచ్చావనీ, త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నాను. యెటువైపునించి యే రూపంలో వస్తావో మరి '' ఈ నిరాశకిటేల వచ్చితి '' అని గజేంద్రుడు పశ్చాత్తాపపడి నిన్ను తలుచుకున్నాడు''.

''నేనూ అంతే. ఆశాపాశము తాకడున్ నిడుపు సత్యమ్ము అన్నట్టు ఆశ అనేపెద్దతాడు మెడకు చుట్టుకున్నాను. ఇపుడు నిరాశ యేడిపిస్తున్నా నీవు వస్తావనీ ఆదుకుంటావనీ నమ్ముతున్నాను. వస్తావు గదూ!''.